సాక్షి వరంగల్

మంగళవారం | 17 | డిసెంబర్ | 2024



తల్లుల 'చల్లని' దర్శనం
వనదేవతల దర్శనానికి వచ్చే భక్తులకు ఎండ తగలకుండా గద్దెల ప్రాంగణం చుట్టూ జీఐ షీట్స్‌తో షెడ్లు నిర్మించనున్నారు.
- 8లో▸



వారి భవితవ్యం తేలనుందా!
కేయూలోని వివిధ విభాగాల్లో 2010లో నియమితులైన అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
$27^0/13^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం పొగమంచు కురుస్తుంది. మధ్యాహ్నం మామూలు ఉష్ణోగ్రత ఉంటుంది. రాత్రి చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మహిళల హక్కులను తెలుసుకోవాలి



గీసుకొండ: మహిళలు తమ హక్కులను తెలుసుకుని సాధించుకున్నప్పుడే సాధికారత సాధ్యం అవుతుందని జిల్లా ట్రైనింగ్ మేనేజర్ కూసం రాజమౌళి అన్నారు. సోమవారం గంగదేవిపల్లిలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మహిళా సహాయతా కమిటీ సభ్యులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో సమన్వయకర్తగా పాల్గొని ఆయన మాట్లాడా రు. మహిళలు తమ సమస్యలను ధైర్యంగా బయటకు చెప్పాలన్నారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ప్రాజెక్టు మేనేజర్ కవిరాజ్ మాట్లాడుతూ మహిళలు వారి కోసం ప్రవేశ పెట్టిన అభివృద్ధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ట్రైనింగ్ కోఆర్డినేటర్ ఇందిర,ఆర్గనైజేషన్ సభ్యులు అక్తర్,వనీత తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

కాళోజీ సెంటర్: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగ యువతీయువకులకు ప్రైవేట్ సెక్టార్‌లో శిక్షణ మరియు ప్లేస్‌మెంట్ జాబ్‌మేళాను ఈ నెల 18న (బుధవారం) నిర్వహించనున్నట్లు ఉపాధి కల్పన, శిక్షణ శాఖ జిల్లా అధికారి సీహెచ్. ఉమారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఉదయం 10.30 గంటలకు వరంగల్ ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు 7093168464 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సర్వశిక్ష ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి

- టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి భోగేశ్వర్



కాళోజీ సెంటర్: సర్వశిక్ష ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ అన్నారు. సోమవారం సర్వశిక్ష ఉద్యోగులు చేస్తున్న నిరసన దీక్షలకు సంఘీభావంగా వసంతాపూర్ యూపీఎస్ పాఠశాలలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో వెట్టిచాకిరి విధానానికి ప్రభుత్వం స్వస్తి పలకాలని, సర్వశిక్ష ఉద్యోగులు, కేజీబీవీ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలన్నారు. కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ తక్షణమే మినిమం టైం స్కేల్ ఇస్తూ ఉత్తర్వులు విడుదల చేసి సమ్మె విరమింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జె.సుభాష్, ఎ.మోహన్ రావు, పి.ఇందిర, వి.రమాదేవి, పి.శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఎంపీఓ శ్రీధర్‌రాజు సస్పెన్షన్

చెన్నారావుపేట: చెన్నారావుపేట ఎంపీఓ శ్రీధర్‌రాజును జిల్లా కలెక్టర్ సత్య శారద సస్పెండ్ చేశారు. ఈ మేరకు ఆమె సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అధికారుల పట్ల దురుసుగా ప్రవర్తించడమే కాకుండా పలు మార్లు బెదిరింపులకు పాల్పడటంతో సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. గతంలో కూడా నెక్కొండ మండలంలో పనిచేసినప్పుడు ఏసీబీకి పట్టుబడ్డాడు. ప్రస్తుతం సస్పెండ్ కావడం విశేషం.

క్రీడల్లో రాణిస్తేనే ఉజ్వల భవిష్యత్



వరంగల్: క్రీడల్లో రాణిస్తే క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జిల్లా యువజన క్రీడల అధికారిణి సత్యవాణి అన్నారు. సోమవారం వరంగల్‌లోని ఓ సిటీ స్టేడియంలో వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ బాలికల జిల్లా స్థాయి కబడ్డీ ఎంపికలకు ముఖ్యఅతిథులుగా వరంగల్ కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, డీవైఎస్ఓ సత్యవాణిలు పాల్గొని మాట్లాడారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారన్నారు. అసోసియేషన్ కార్యదర్శి అబ్దుల్లాఖాన్ మాట్లాడుతూ సుమారు 140 మంది క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు కె.మల్లికార్జున్, అక్తర్, రిఫరీ బోర్డు కన్వీనర్ హసన్, నారాయణ, మండల బాధ్యులు ఏలియా, రవీందర్, శ్రీకాంత్, కబడ్డీ కోచ్ రవికుమార్ పాల్గొన్నారు.

రిటైర్డ్ హర్ట్!

ప్రభుత్వం పట్టించుకోవడంలేదని పెన్షనర్ల ఆవేదన


- పెన్షన్ బహుమానం కాదు.. గత సేవలకు చెల్లింపు
- జనవరి వస్తే పెండింగ్‌లో ఐదు డీఏలు
- ప్రభుత్వం వైపు ఆశగా చూపు
- పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్
- నేడు జాతీయ పెన్షనర్స్ డే


పింఛను అనేది ఒక బహుమానం కాదు, యజమాని దయపై ఆధారపడిన విషయం కాదు. లేదా ఎక్స్‌గ్రేషియా చెల్లింపు కాదు. ఇది గతంలో అందించిన సేవలకు చెల్లింపు. సామాజిక–ఆర్థిక న్యాయం అందించే సామాజిక సంక్షేమ చర్య.

- 1982 డిసెంబర్ 17న సుప్రీంకోర్టు తీర్పు

పెన్షనర్ల గౌరవం, సమాజంలో గుర్తింపు కోసం సంవత్సరాలుగా పోరాడిన డీఎస్ నకరాను కృతజ్ఞతతో స్మరించుకోవడానికి ' ప్రతిఏటా డిసెంబర్ 17న 'జాతీయ పెన్షనర్స్ డే' జరుపుకుంటారు.

జిల్లాల వారీగా పెన్షనర్లు ఇలా..





హెల్త్‌కార్డుపై ఎడతెగని పోరాటం..

వృద్ధాప్యంలో తరచూ అనారోగ్య సమస్యలు ఎదురుకావడం సర్వసాధారణం. క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ అందించాలని ఏళ్ల తరబడి పోరాటం చేస్తున్నా వారి శ్రమకు ఫలితం దక్కడం లేదు. ప్రభుత్వం హెల్త్‌కార్డులు జారీ చేసినా.. పూర్తి స్థాయిలో ప్రయోజనం చేకూరడం లేదనే ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో పరిమితి లేకుండా వైద్య చికిత్స అందించాలని ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు. ఉద్యోగిగా సేవలు అందించినందుకు పెన్షనర్ల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన, చికిత్స అందించాల్సిన పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని అంటున్నారు.

హన్మకొండ: యుక్త వయస్సులో సేవలు అందించిన ఉద్యోగులకు వృద్ధాప్యంలో పూర్తిస్థాయి బెనిఫిట్లు అందడం లేదు. దాదాపు 40 ఏళ్లపాటు సర్వీస్ చేసి రిటైర్డ్ అయ్యాక ఆర్థిక భరోసా,అందాల్సిన ప్రయోజనాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని చెబుతున్నారు.పెన్షన్ దయతో ఇచ్చేది కాదు.. గత సే వలకు ఇచ్చే చెల్లింపు అని పెన్షనర్లు పేర్కొంటున్నా రు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 30వేల మందికిపైగా పెన్షనర్లు ఉన్నారు. ఆయా జిల్లాల్లో అసోసియేషన్లు ఏర్పాటుచేసుకుని న్యాయమైన డిమాండ్ల సాధనకు పోరాటం చేస్తున్నారు. నేడు జాతీయ పెన్షనర్స్ డే సందర్భంగా వారి దీర్ఘకాలిక సమస్యలపై కథనం.

అసోసియేషన్ల ఏర్పాటుతో సంఘటితం

ఉమ్మడి జిల్లా పరిధిలోని అన్ని జిల్లాల్లో ఇప్పటికే పెన్షనర్ల అసోసియేషన్లు ఉన్నాయి. కొన్నిచోట్ల సొంత భవనాలు సైతం నిర్మించుకున్నారు. జిల్లా పరిధిలోని రిటైర్డ్ ఉద్యోగులు అందులో సభ్యులుగా ఉంటున్నారు. తమ సమస్యల పరిష్కారానికి అసోసియేషన్‌ను వేదికగా చేసుకుని గళం వినిపిస్తున్నారు. సాయంత్రం ఆటవిడుపుగా అసోసియేషన్ భవనాలు ఉపయోగపడుతున్నాయి. లైవ్‌సర్టిఫికెట్ల సమర్పణ సమయంలో సదస్సులు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ బాసటగా నిలుస్తున్నాయి.

3,500పైచిలుకు రైల్వే రిటైర్డ్ ఉద్యోగులు

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే సబ్‌డివిజన్ పరిధిలో గల కాజీపేటతోపాటు వరంగల్–విజయవాడ రూట్‌లోని కొండపల్లి వరకు, ఘన్‌పూర్– జనగామ–ఆలేరు వరకు, జమ్మికుంట– పెద్దపల్లి– రామగుండం– బెల్లంపల్లి– సిర్పూర్‌కాగజ్‌నగర్ వరకు కలిపి మొత్తం 3,500 మందిపై చిలుకు రైల్వే రిటైర్డ్ ఉద్యోగులు ఉన్నారు. ఆయాచోట్ల ఏర్పాటుచేసిన అసోసియేషన్లు రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం, వివిధ బెనిఫిట్స్ అందజేతలో సహాయపడుతున్నాయి. ఒక్క కాజీపేట అసోసియేషన్‌లోనే 1,500 మంది సభ్యత్వం కలిగి ఉన్నట్లు ఆ అసోసియేషన్ అధ్యక్షుడు కందుల సంగమయ్య తెలిపారు.

సమస్యలపై ప్రభుత్వం చర్చించాలి...



పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన మంత్రివర్గ సబ్ కమిటీ.. పెన్షనర్ల సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి చర్చించాలి. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలి. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉండడం వల్ల ఇబ్బంది అవుతుంది.

- ఇనర్సింహారెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ సలహాదారుడు

ప్రభుత్వం చిన్నచూపు...



పెన్షనర్లను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. ప్రధానమైన, న్యాయమైన సమస్యలు పరిష్కరించకుండా కావాలని జాప్యం చేస్తోంది. ఎన్నికల ముందు ఆరు నెలల్లో సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి ఏడాదైనా పట్టించుకోవడం లేదు.

- తూపురాణి సీతారాం, తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ

ఇబ్బందులు పెట్టడం సరికాదు..



వృద్ధాప్యంలో ఇబ్బందులకు గురి చేయడం ఎంతవరకు సమంజసం..? చేసిన సేవలకు గుర్తింపుగా, గౌరవంగా ఇచ్చేది పెన్షన్. పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలి. 12 ఏళ్లకే పూర్తి పెన్షన్ ఇవ్వాలి.

- తిరువరంగం ప్రభాకర్, తెలంగాణ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి

ఒకరికొకరు తోడుగా..



దోర్నకల్ రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో రిటైర్డ్ ఉద్యోగులు

దోర్నకల్: దోర్నకల్ రైల్వే జంక్షన్ పరిధిలోని రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ ద్వారా ఒకరికొకరు తోడుగా నిలుస్తున్నారు. 1997లో కొంతమంది పదవీ విరమణ పొందిన ఉద్యోగులు దోర్నకల్‌లో రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేశారు. 150 మందితో నెలవారీ సభ్యత్వ రుసుముతో అసోసియేషన్ ప్రారంభించి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పెన్షన్ పొందే సమయంలో ఎదురవుతున్న సమస్యలు, రైల్వే పాసుల మంజూరీ, లైవ్ సర్టిఫికెట్ల సమర్పణ, బ్యాంకుల్లో ఎదురయ్యే సమస్యలను అసోసియేషన్ ప్రతినిధులు పరిష్కరిస్తున్నారు. ప్రస్తుతం 445 మంది సభ్యులు ఉండగా నెలకు రూ.150 చొప్పున సభ్యత్వ రుసుము వసూలు చేస్తున్నారు. సభ్యుడు ఎవరైనా మరణిస్తే రూ.15 వేలు డెత్‌ఫండ్ కింద అందిస్తున్నారు.

ప్రధాన డిమాండ్లు ఇవీ..

- 2023లో ఇవ్వాల్సిన పీఆర్‌సీ ఇప్పటికీ ఇవ్వలేదు. వెంటనే ప్రకటించి 2023 జూన్ మాసం నుంచి అమలు చేయాలి.
- 5 డీఏలు ఇవ్వాల్సి ఉండగా ఒక్క డీఏ ఇచ్చారు. జనవరిలో మరో డీఏ ఇవ్వాల్సి ఉంది. పెండింగ్ డీఏలు 5కు చేరుకోనుండడంతో మొత్తం వెంటనే ఇవ్వాలి.
- మెడికల్ రీయింబర్స్‌మెంట్‌తోపాటు పెండింగ్ బిల్లులను మూడు నెలల్లో చెల్లించాల్సి ఉండగా ఏడాదైనా చెల్లించడం లేదు. వీటిని వెంటనే విడుదల చేయాలి.
- కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి.
- రూ.398లతో నియామకమైన ఉపాధ్యాయులకు నోషనల్ ఇంక్రిమెంట్ చెల్లించి వీరికి పూర్తి పెన్షన్ సౌకర్యం కల్పించాలి.
- ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటకలో సీనియర్ సిటిజన్లకు ఆర్టీసీ బస్సు ప్రయాణంలో 25 శాతం రాయితీ కల్పిస్తున్నట్లుగానే రాష్ట్రంలోనూ కల్పించాలి.
- రిటైర్డ్ అయ్యాక స్వస్థలాల్లో నివాసం ఉంటారు. ఏదేని చిన్న అవసరం వచ్చినా, ఇతర సమస్యలు తలెత్తినా సుదూర ప్రాంతాల్లోని పాత కార్యాలయాలకు వెళ్లడం వృద్ధాప్యంలో చాలా ఇబ్బందికరం. పెన్షనర్స్ డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలి.

ముగిసిన గ్రూప్–2 పరీక్షలు



అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

వరంగల్/ఖిలా వరంగల్: జిల్లాలో గ్రూప్–2 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. సోమవారం జరిగిన పేపర్–3 పరీక్షకు 5,174 మంది, పేపర్–4 పరీక్షకు 5,167 మంది అభ్యర్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు. రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల, వరంగల్ సెంట్రల్ పబ్లిక్, ఏఎస్ఎం, తాళ్ల పద్మావతి ఫార్మసీ కళాశాలలో జరిగిన పరీక్ష కేంద్రాలకు సుమారు ఐదుగురు అభ్యర్థులు రెండు నిమిషాల ఆలస్యం కావడంతో అధికారులు పరీక్ష కేంద్రాలకు అనుమతించలేదు. జిల్లా వ్యాప్తంగా సెంటర్ల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సమస్యలు పరిష్కరిస్తాం..

- సీకేఎం ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ సత్యశారద



గర్భిణుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ సత్యశారద

ఎంజీఎం: సీకేఎం ఆస్పత్రిలోని సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని కలెక్టర్ డాక్టర్ సత్యశారద తెలిపారు. సోమవారం వరంగల్‌లోని సీకేఎం ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సుమారు రెండు గంటల పాటు ప్రతీ విభాగాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓపీ సంఖ్య పెరుగుతున్నందున ప్రస్తుతం ఉన్న రెండు కౌంటర్లకు అదనంగా మరో కౌంటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. శానిటేషన్, సెక్యూరిటీ విభాగం, పారామెడికల్ సిబ్బంది కొనసాగింపుపై ప్రత్యేకంగా సమీక్షా చేసి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. వైద్యులతో పాటు వైద్య సిబ్బందికి బయోమెట్రిక్ అటెండెన్స్ తీసుకోవాలన్నారు. ఇంజనీరింగ్ అధికారుల ద్వారా ప్రత్యేక నిధులు కేటాయించి ఆస్పత్రిలో డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరుస్తామన్నారు. అనంతరం గర్భిణులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ నిర్మల, ఆర్ఎంఓలు డాక్టర్ వేణుగోపాల్, సత్యజిత్, ఏఓ సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

వివరాల నమోదులో నిర్లక్ష్యం వద్దు

- జెడ్పీ సీఈఓ రాంరెడ్డి



ఖానాపురం: కొత్తూరులో సర్వేను పరిశీలిస్తున్న సీఈఓ రాంరెడ్డి

ఖానాపురం/నల్లబెల్లి/ దుగ్గొండి: ఇందిరమ్మ ఇళ్ల సర్వే సందర్భంగా వివరాలను నమోదు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని జెడ్పీ సీఈఓ రాంరెడ్డి అన్నారు. సోమవారం ఖానాపురం మండలం కొత్తూరు, నల్లబెల్లి మండలం కొండాయిపల్లి, రుద్రగూడెం, దుగ్గొండి మండలంలోని పలు గ్రామాల్లో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవనాలు ఉన్న వారి వివరాలు నమోదు చేయొద్దని, గుడిసెలు, పెంకుటిళ్లు ఉండి అర్హత కలిగిన ప్రతీఒక్కరి వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. లబ్ధిదారుల ఎంపిక సర్వే వేగవంతంగా చేపడుతూ ఈ నెల 31వ తేదీ వరకు పూర్తి చేయాలని సూచించారు. లబ్ధిదారుల ఎంపిక చేసేందుకు 619 మంది ఎన్యుమరేటర్లను నియమించగా సర్వేలో పాల్గొంటున్నారని, ఇప్పటివరకు 5,533 మంది ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల సర్వే పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓలు భారతి, లెక్కల అరుందతి, ఎంపీఓలు సునీల్‌కుమార్, శ్రీధర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి స్రవంతి, రజిత, పద్మనాభస్వామి, కవిత, కారోబార్ కాసు యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

విలీన వెతలు..

'జిల్లాలోని తొమ్మిది గ్రామాల్లో విచిత్ర పరిస్థితి ఉంది. 2016లో మండలాల పునర్విభజనలో చెన్నారావుపేట మండలం నుంచి నెక్కొండ మండలంలో చేరిన అమీన్‌పేట గ్రామం నుంచి, ఆ తర్వాత కొత్త పంచాయతీలుగా ఆర్‌కే తండా (రామన్నకుంట తండా), టేకులకుంట (టీకే) తండాలు ఏర్పడ్డాయి. సూరిపల్లి గ్రామం కూడా విలీనమైంది. చెన్నారావుపేట మండలం నుంచి గురిజాల, చిన్న గురిజాల, గుంటూరుపల్లి, జీజీఆర్ పల్లి, ముగ్ధుంపురం గ్రామాలు కూడా నర్సంపేట మండలంలో కలిశాయి. అయితే పేరుకే ఈ గ్రామాలు సమీప మండలాల్లో విలీనమైనా రెవెన్యూ, పోలీస్‌స్టేషన్ పరంగా పాత మండలాల్లోనే ఉండడంతో కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. తాజాగా నెక్కొండ మున్సిపాలిటీ ఏర్పాటు అంశంతో మండలాలు మారిన ఇంకా పాత అవస్థలే ఉన్న గ్రామాల పరిస్థితి తెరమీదకు వచ్చింది'

ఎనిమిదేళ్లయినా మారని రెవెన్యూ, పోలీస్‌స్టేషన్‌ల పరిధి

- ఇబ్బందులు పడుతున్న తొమ్మిది గ్రామాల ప్రజలు
- తాజాగా నెక్కొండ మున్సిపాలిటీతో తెరమీదకు అవస్థలు
- రెవెన్యూ పరిధి మార్చితేనే మున్సిపాలిటీకి మద్దతు

సాక్షి, వరంగల్: జిల్లాలో నెక్కొండ మున్సిపాలిటీ ఏర్పాటు అంశం ఎనిమిదేళ్లుగా ప్రజలు ఎదుర్కొంటున్న అంశాలను తెరమీదకు తీసుకొచ్చింది. 2016లో మండలాల పునర్విభజనలో భాగంగా చెన్నారావుపేట మండలం నుంచి నెక్కొండ మండలంలో చేరిన అమీన్‌పేట గ్రామం నుంచి, ఆ తర్వాత కొత్త పంచాయతీలుగా ఆర్ కే తండా (రామన్నకుంట తండా), టేకులకుంట (టీకే) తండాలు ఏర్పడ్డాయి. అయితే పేరుకే నెక్కొండ మండలంలోని ఈ గ్రామాలకు రెవెన్యూ గ్రామం చెన్నారావుపేట మండంలంలోని అమీనాబాద్ ఉండడంతో భూక్రయ విక్రయాల రిజిస్ట్రేషన్లు, పట్టాపాస్ పుస్తక సమస్యల పరిష్కారానికి 14 కిలోమీటర్ల దూరంలో ఉన్న చెన్నారావుపేట మండలంలోని తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. అదే సమయంలో పోలీస్‌స్టేషన్ పరిధి కూడా చెన్నారావుపేట ఠాణా పరిధిలో ఉండడంతో వివిధ గొడవలు, సమస్యలు, ప్రమాదం జరిగినప్పుడు ఫిర్యాదుల కోసం 14 కిలోమీటర్లు ప్రయాణం చేస్తున్నారు. ఇన్నాళ్లూ ఈ విషయాన్ని వివిధ సందర్భాల్లో నాయకుల దృష్టికి తీసుకెళ్లినా పెద్దగా పట్టించుకోకపోవడంతో ×నెక్కొండ మున్సిపాలిటీ₹ ఏర్పాటు రూపంలో తమ సమస్యల గళం వినిపించేందుకు ఇప్పుడు వారికి వేదిక దొరికినట్టింది. నెక్కొండ, నెక్కొండ తండా, గుండ్రపల్లి, పత్తిపాక గ్రామాలతో పాటు అమీన్‌పేట, టేకులకుంట(టీకే) తండాలతో ఏర్పడనున్న ఈ మున్సిపాలిటీకి ఆయా గ్రామాల్లో గ్రామసభల ద్వారా ప్రజాభిప్రాయ సేకరణకు అధికారులు శ్రీకారం చుట్టారు. అయితే అమీన్‌పేట, టేకుల తండా గ్రామ ప్రజలు తమ గ్రామాలను రెవెన్యూ, పోలీస్‌స్టేషన్‌ల పరిధిని చెన్నారావుపేట మండలం నుంచి తమకు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న నెక్కొండ మండలానికి మారిస్తేనే మున్సిపాలిటీ ఏర్పాటుకు తమ మద్దతనే గళాన్ని వినిపిస్తున్నారు. మున్సిపాలిటీలో గ్రామాల విలీనం ద్వారా అంతర్గత రోడ్లు, మురికి కాల్వల నిర్మాణం, రోడ్ల విస్తరణ తదితర అభివృద్ధి పనులు జరుగుతాయని అధికారులు వివరిస్తున్నా.. ఎనిమిదేళ్లుగా ఉన్న సమస్యలను పరిష్కరిస్తేనే మేం ముందుకు వస్తామంటూ ముక్తకంఠంతో నినదిస్తున్నారు.

మరికొన్ని గ్రామాలదీ అదే పరిస్థితి..

- నెక్కొండ మండలంలోని సూరిపల్లి గ్రామం చెన్నారావుపేట మండలం నుంచి 2016లోనే విలీనమైంది. నెక్కొండ నుంచి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ఊరి ప్రజలు రెవెన్యూ సమస్యలు, పోలీస్‌స్టేషన్ కోసం 13 కిలోమీటర్ల దూరంలో ఉండే చెన్నారావుపేటకు వెళ్తున్న పరిస్థితి ఉంది.
- చెన్నారావుపేట మండలం నుంచి గురిజాల, చిన్న గురిజాల, గుంటూరుపల్లి, జీజీఆర్‌పల్లి, ముగ్ధుంపురం గ్రామాలు 2016లో నర్సంపేట మండలంలో కలిశాయి. అదే సమయంలో పోలీస్‌స్టేషన్ కూడా ఇంకా చెన్నారావుపేట పరిధిలోనే ఉండడంతో ఫిర్యాదులకు అక్కడికెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ఇలా వేలాది మంది జనాలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అవగాహన ఉన్న రెవెన్యూ, పోలీసు అధికారులు మండలాలు మారిన ఈ గ్రామాలను ఆయా మండలాల పరిధిలోకి తీసుకెళ్లాలని సూచించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ముఖ్య ప్రజాప్రతినిధులు కూడా కొన్ని సందర్భాల్లో మారుస్తామని చెప్పినా ఇప్పటికీ ఆచరణకు నోచుకోలేదు.

మూడు చోట్ల అనుకూలం.. రెండు చోట్ల ప్రతికూలం



టీకేతండా గ్రామసభలో మున్సిపాలిటీని వ్యతిరేకిస్తున్న గ్రామస్తులు

నెక్కొండ: నెక్కొండ మేజర్ గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ కోరింది. దీంతో మున్సిపాలిటీలో నెక్కొండతోపాటు విలీనం కానున్న నెక్కొండ తండా, పత్తిపాక, గుండ్రపల్లి, అమీన్‌పేట, టేకులకుంట (టీకే) తండా జీపీ కార్యాలయాల్లో సోమవారం ప్రత్యేక గ్రామసభలను నిర్వహించారు. నెక్కొండ, పత్తిపాక, నెక్కొండ తండా జీపీ గ్రామసభల్లో గ్రామస్తులు ఏకగ్రీవంగా మున్సిపాలిటీ ఏర్పాటుకు మద్దతు నిచ్చారు. అయితే గుండ్రపల్లిలో జరగాల్సిన గ్రామ సభ నేడు (మంగళవారం) నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రవీణకుమార్ తెలిపారు. అలాగే అమీన్‌పేట, టీకే తండా గ్రామాల ప్రజలు మున్సిపాలిటీలో చేరేందుకు నిరాకరిస్తున్నారు. అయితే అమీన్‌పేట, టీకే తండా గ్రామాలు అదే మండలంలోని అమీనాబాద్ రెవెన్యూ గ్రామ పరిధిలోనే కొనసాగడం, పోలీస్‌స్టేషన్ కూడా మారకపోవడం ఇబ్బందిగా ఉందని పలువురు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా గ్రామసభల్లో గ్రామ ప్రత్యేక అధికారులు ప్రవీణ్‌కుమార్, రాజ్‌కుమార్, యాదగిరి, గ్రామ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో విలీనం కాలేదు..



చెన్నారావుపేట నుంచి నెక్కొండ మండలంలో పూర్తిస్థాయిలో విలీనం కాకనే ఇబ్బందులు పడుతున్నాం. నెక్కొండ మండలంలో ఉన్నట్లేగానీ ముఖ్యమైన రెవెన్యూ, పోలీస్ శాఖలు ఇప్పటికీ మారలేదు. ప్రతీ విషయంలో చెన్నారావుపేటకు వెళ్లడం కష్టంగా ఉంది. అధికారులు రెవెన్యూ, పోలీస్ శాఖల విలీనంపై స్పష్టత ఇస్తే నెక్కొండ మున్సిపాలిటీలో విలీనానికి మద్దతు ఉంటుంది.

- చిలుపురి యాకయ్య, మాజీ సర్పంచ్, అమీన్‌పేట

మున్సిపాలిటీతో నష్టాలు..



నెక్కొండ మున్సిపాలిటీగా అవతరిస్తే విలీన గ్రామాలకు నష్టాలే. ముఖ్యంగా ఏ నిర్మాణం చేపట్టాలన్న మున్సిపాలిటీ పర్మిషన్ అవసరం. ప్రజలపై పన్నుల భారం పెరగనుంది. కొన్ని పనులకు పోలీసుల పర్మిషన్‌కు చెన్నారావుపేటకు, మున్సిపాలిటీ పర్మిషన్‌కు నెక్కొండకు రావడమంటే ఇబ్బందులే. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రతీ సమస్యను దృష్టిలో ఉంచుకొని ముందుకు సాగాలి.

- తేజావతు విజయ్‌కుమార్, గ్రామస్తుడు, టీకే తండా

క్లుప్తంగా

జ్వరంతో మూడేళ్ల బాలుడి మృతి


మానస్ మేఘనాథ్ (ఫైల్)

వాజేడు: ఏజెన్సీలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ములుగు జిల్లా వాజేడు మండలం జగన్నాథపురంలో సోమవారం జ్వరంతో మూడేళ్ల బాలుడు చనిపోయాడు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. జగన్నాథపురం గ్రామానికి చెందిన కొప్పుల ప్రశాంత్, నాగలక్ష్మి దంపతుల ఒక్కగానొక్క కుమారుడు మానస్ మేఘనాథ్(3) ఇటీవల జ్వరం రాగా ఆస్పత్రిలో చికిత్స పొందాడు. ఆదివారం జ్వరం తిరగ బెట్టడంతో స్థానికంగా చూపించగా తీవ్రత ఎక్కువగా ఉందని, వెంటనే భద్రాచలం తీసుకెళ్లాలని సూచించారు. భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షలు చేస్తున్న సమయంలోనే రెండుసార్లు ఫిట్స్ వచ్చాయి. పరిస్థితి విషమంగా ఉందని, ఖమ్మం తీసుకెళ్లాలని వైద్యులు తెలిపారు. ఖమ్మం తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందినట్లు అనుమానం రావడంతో కొత్తగూడెంలోని ఆస్పత్రుల్లో చూపించగా చనిపోయినట్లు చెప్పారు.

కొడుకు బతికే ఉన్నాడని..

ఇంటికి తీసుకువచ్చాక బాలుడి నోట్లోనుంచి చిన్నగా శబ్దం రావడంతో ఇంకా బతికే ఉన్నాడని భావించిన తల్లిదండ్రులు, బంధువులు ఏటూరునాగారం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. చివరికి ఇంటికి తీసుకువచ్చి అంతిమ సంస్కారాలు చేశారు.

రైలు ఢీకొని పాయింట్‌మెన్..


రమేశ్(ఫైల్)

సంగెం: విధుల్లో ఉన్న పాయింట్‌మెన్‌ను రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన వరంగల్ జిల్లా సంగెం మండలంలో చోటు చేసుకుంది. బంధువులు, స్థానికుల కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌కు చెందిన రాసమల్ల రమేశ్(45) సంగెం మండలం గాంధీనగర్‌లో భార్య రజితతో కలిసి అద్దెకు ఉంటూ ఎల్గూర్ రైల్వే స్టేషన్‌లో పాయింట్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. రోజుమాదిరిగా విధులు నిర్వహిస్తున్న క్రమంలో సోమవారం సాయంత్రం ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం నుంచి రెండో నంబర్ ప్లాట్‌ఫాంకు వెళ్లి సిగ్నల్ ఎక్స్ఛేంజ్ ఇవ్వడానికి వెళ్తున్నాడు. ప్లాట్‌ఫాం ఎత్తుగా ఉండడంతో ఎక్కడం ఆలస్యమైంది. అదే సమయంలో విజయవాడ వైపునకు వెళ్తున్న రైలు ఢీకొంది. ఈ ఘటనలో రమేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టి దాదాపు ఏడాదిన్నర దాటినా పనులు ఇంకా పూర్తికాలేదు. దీంతో ప్రయాణికులు, ఉద్యోగులు మూడు లైన్లు, స్టేషన్ వద్ద ఉన్న రెండు లూప్ లైన్ల మొత్తం అయిదు లైన్లు దాటడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణం జరిగి ఉంటే రమేశ్ మృతి చెందేవాడు కాదని సహ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. శవపంచానామా నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

తల్లుల ‘చల్లని’ దర్శనం..

- రూ. 3 కోట్ల వ్యయంతో త్వరలో మొదలుకానున్న పనులు
- వచ్చే మహాజాతర నాటికి సిద్ధం
- మండు వేసవిలోనూ చల్లని వాతావరణంలో అమ్మవార్ల దర్శన భాగ్యం

మేడారంలో భక్తుల క్యూలైన్లపై జీఐ షీట్స్‌తో షెడ్ల నిర్మాణం


క్యూలైన్లపై ఏర్పాటు చేసిన తడకలు(ఫైల్)

ఎస్ఎస్ తాడ్వాయి: వనదేవతలు సమ్మక్క, సారలమ్మ దర్శనానికి వచ్చే భక్తులకు శుభవార్త. ఇక నుంచి అమ్మవార్ల దర్శనం చల్లని వాతావరణంలో జరగనుంది. జాతర సమయంలో మండు వేసవిలోనూ ఎండ తగలకుండా తల్లులను సందర్శించుకునేలా మేడారంలో మౌలిక వసతులు మెరుగుపరుస్తున్నారు. ఇందులో భాగంగా గద్దెల ప్రాంగణ చుట్టూ ఉన్న క్యూలైన్ల మీద జీఐ షీట్స్‌తో షెడ్లు నిర్మించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ. 3 కోట్లు మంజూరు చేసింది. ఇటీవల టెండర్లు కూడా పూర్తయ్యాయి. అగ్రిమెంట్ పూర్తయిన అనంతరం త్వరలో పనులు ప్రారంభిస్తామని పీఆర్ డీఈ ధర్మేందర్ తెలిపారు.

భక్తులకు ఇబ్బందులు..

తడక పందిళ్ల ఎత్తు తక్కువ ఉండడంతో గాలి, వెలుతురు సరిగా ప్రసరించదు. పైగా ఎత్తు తక్కువ ఉండడంతో షార్ట్ సర్క్యూట్ జరిగే అవకాశం ఉండడంతో పందిళ్ల కింద ఫ్యాన్లు ఏర్పాటు చేసే అవకాశం లేదు. ఫలితంగా ఈ పందిళ్ల కింద భక్తులు ఉక్కపోతతో అల్లాడుతున్నారు. వృద్ధులు, పిల్లలు ఊపిరిసలపని రద్దీలో తల్లుల దర్శనానికి వెళ్తున్నారు. నాలు గు జాతరల సందర్భంగా పగటి వేళ హెచ్చు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో రోజూ పదుల సంఖ్యలో భక్తులు ఊపిరాకడ ఇబ్బంది పడుతున్నా రు. ఇలాంటి వారిని ఎమర్జెన్సీ టీమ్, మెడికల్ టీమ్‌లు వెనువెంటనే అప్రమత్తమై కాపాడుతున్నారు. ఈ సమస్యలకు పరిష్కారం చూపేలా క్యూలైన్ల ప్రాంగణంలో జీఐ షీట్స్‌తో షెడ్లు నిర్మించనున్నారు.

జాతర సమయంలో తడక పందిళ్లు

రెండు దశాబ్దాల నుంచి మేడారం జాతరకు భక్తులు పోటెత్తున్నారు. దీంతో భక్తుల రద్దీని నియంత్రించేందుకు రెండు భారీ క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఇందులో ఒక క్యూలైన్ జంపన్న వాగు నుంచి గద్దెలకు వచ్చే రోడ్డులో ఐటీడీఏ ఆఫీస్ దగ్గర ఆస్పత్రి (టీటీడీ కల్యాణ మండపం) దగ్గర ఉండగా, మరో క్యూలైన్ ఆర్టీసీ బస్ పాయింట్ నుంచి గద్దెలకు చేరుకునే మార్గంలో రెడ్డిగూడెం రోడ్డు దగ్గర ఉంటుంది. ఈ రెండు క్యూలైన్ల మొత్తం దూరం మూడు కిలోమీటర్ల వరకు ఉంటుంది. జాతర సమయంలో భక్తులకు ఎండ నుంచి రక్షణ కల్పించడానికి ఈ క్యూలైన్ల మీద తడక పందిళ్లు ఏర్పాటు చేస్తారు. వీటి కింద నడుస్తూ భక్తులు తల్లులను దర్శించుకుంటారు.

అన్ని సౌకర్యాలు ఉండేలా..

క్యూలైన్ల దగ్గర జీఐ షీట్స్‌తో ఎత్తైన షెడ్ల నిర్మాణం చేపట్టడం వల్ల గాలి, వెలుతురు అధిక స్థాయిలో వస్తుంది. పైగా ఫ్యాన్లు కూడా బిగించే అవకాశం ఉంటుంది. దీంతో భక్తులు ప్రశాంత వాతావరణంలో త ల్లులను దర్శనం చేసుకునే వెసులుబాటు కలుగుతుంది. జీఐషెడ్ల నిర్మాణంతో పాటు క్యూలైన్లలో కూ ర్చునేందుకు వీలుగా అక్కడక్కడ బెంచీలు, బల్లల నిర్మాణాలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు. జాతర సమయంలో వన దేవతలను దర్శించుకునేందుకు రాత్రి, పగలు అనే తేడాలేకుండా లక్షల సంఖ్యలో భక్తులు క్యూలైన్లలోకి వస్తుంటారు. ఇలా వచ్చే భక్తుల్లో తల్లులు నుంచి వృద్ధుల వరకు ఉంటారు. ఒక్కసారి లైన్‌లోకి వస్తే నాలుగైదు గంటలు నిలబడే ఉండాల్సి వస్తోంది. మరికొందరు భక్తులు బంగారం ఎత్తుకుని క్యూలైన్‌లోకి వస్తుంటారు. ఇలాంటి వారికి కాస్త సమయం ఉపశమనం కలిగించేలా క్యూలైన్లపై జీఐ షీట్స్ షెడ్లు నిర్మాణం చేయడం వల్ల సౌకర్యంగా ఉంటుంది.

సమ్మక్క గుడి



ఆలయాల పునర్నిర్మాణం

మేడారం అంటే అందరికీ గుడిగోపురాలు లేకుండా ఉన్న గద్దెల ప్రాంగణమే గుర్తుకు వస్తుంది. కానీ మేడారం గ్రామంలో సమ్మక్క గుడి, కన్నెపల్లిలోని సారలమ్మ గుడి ఉంది. ఈ క్రమంలో ఈ రెండు ఆలయాలను పునర్నిర్మాణం చేసేందుకు ప్రణాళిక సిద్ధమైంది. రూ.1.92 కోట్ల వ్యయంతో ఈ రెండు ఆలయాల పనులు ప్రారంభించనున్నారు. 2026 మహాజాతర నాటికి సిద్ధం చేయాలని లక్ష్యం ఏర్పరుచుకున్నారు.


సారక్క గుడి

మదర్ ఫీడింగ్ సెంటర్..

సంతాన భాగ్యం కోసం ఎంతోమంది దంపతులు జాతరకు వస్తారు. సారలమ్మ వచ్చే రోజున వరం పడుతుంటారు. తమ కోరికలు నెరవేరిన తర్వాత వచ్చే తొలి జాతరకే వచ్చే తల్లుల సంఖ్య వేలలో ఉంటుంది. ఇలాంటి వారు క్యూ లైన్లలో పిల్లలకు పాలు పట్టించేందుకు ఇబ్బంది పడుతున్నారు. వీరి కోసం మదర్ ఫీడింగ్ సెంటర్ క్యూలైన్లలో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. అదే విధంగా అవకాశమున్న చోట వాష్‌రూమ్‌లు కూడా నిర్మిస్తే మరింత సౌకర్యంగా ఉంటుందని భక్తులు పేర్కొంటున్నారు.

సైబర్ మోసం..

- ఏఎస్సై పేరుతో సైబర్ నేరగాడి ఫోన్
- రూ.80వేలు ఫోన్ పే చేయించుకున్న కేటుగాడు
- మోసపోయిన జీరో అకౌంట్ నిర్వాహకుడు



నర్సింహులపేట: ఏఎస్సై పేరుతో సైబర్ నేరస్తుడు ఓ వ్యక్తికి ఫోన్ చేసి రూ.80 వేలు స్వాహా చేశాడు. ఈ ఘటన మండల కేంద్రంలో జరిగింది. నర్సింహులపేటకు చెందిన జీరో అకౌంట్ నిర్వాహకుడు గుగులోతు రమేశ్‌కు ఓ గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. తాను నర్సింహులపేట పీఎస్ నుంచి ఏఎస్సై భాస్కర్‌రావును మాట్లాడుతున్నాని, ఎస్సై పాప హైదరాబాద్‌లో చికిత్స పొందుతుందన్నాడు. ఇందుకోసం రూ. 80వేలు అర్జెంట్‌గా చేయాలని ఫోన్ పే చేయాలని చెప్పాడు. తాను లిక్విడ్ క్యాష్ ఇస్తానని పేర్కొన్నాడు. దీనికి రమేశ్ స్పందిస్తూ తాను హైదరాబాద్‌లో ఉన్నానని, జీరో అకౌంట్‌లో పని చేస్తున్న తన కుమారుడితో మాట్లాడుతానని, షాపు వద్దకు డబ్బులు పంపమని చెప్పాడు. అంతలోనే మరోసారి అర్జెంట్ ఉందని చెప్పడంతో నమ్మిన రమేశ్ వెంటనే రూ.80 వేలు ఫోన్‌పే చేశాడు.డబ్బు సెండ్ కాగానే అవతలి వ్యక్తి వెంటనే ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. దీనిపై రమేశ్ వెంటనే పీఎస్‌కు ఫోన్ చేయగా మోసమని తెలిసింది. దీంతో సైబర్ మోసం జరిగిందని భావించిన రమేశ్ ఆదివారం పీఎస్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై సురేశ్ తెలిపారు.

కళ్లలో కారం చల్లి.. గొడ్డలితో నరికి

- ఐదుగుంటల భూమి కోసం అన్నను చంపిన నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, సీఐ, ఎస్సై

కాటారం: ఐదు గుంటల భూమి కోసం సొంత అన్న అని కూడా చూడకుండా అతికిరాతంగా హత్య చేసిన తమ్ముడు, ఆయన కుటుంబ సభ్యులు ఐదుగురిని సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు కాటారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి కేసు, నిందితుల వివరాలు వెల్లడించారు. కాటారం మండలం దేవరాంపల్లికి చెందిన మారుపాక సారయ్య కొంత కాలంగా భూపాలపల్లి జిల్లా కేంద్రంలో కూలీ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన భూమిని సారయ్య తమ్ముడు సమ్మయ్య, మరో తమ్ముడి భార్య లక్ష్మి గతంలో సమాన వాటాలుగా పంచుకున్నారు. సమ్మయ్యకు చెందిన రెండు గుంటలు, లక్ష్మికి చెందిన మూడు గుంటల భూమి సారయ్యకు ఇస్తామని గత ఫిబ్రవరిలో గ్రామపెద్దల సమక్షంలో నిందితులు అంగీకరించారు. కానీ సారయ్యకు ఆ భూమి ఇవ్వకపోవడంతో ఈ నెల 14న గ్రామంలో పంచాయితీ నిర్వహించారు. ఇందులో భూమి ఇవ్వడానికి నిందితులు ఒప్పుకోలేదు. భూమి అడుగుతున్నాడని మనసులో పెట్టుకున్న సమ్మయ్య, లక్ష్మి.. సారయ్యను అదే రోజు హత్య చేయాలని పథకం రూపొందించారు. అనంతరం సమ్మయ్య, కుటుంబ సభ్యులు అంజి, ఓ బాలుడు, మారుపాక లక్ష్మి, స్వప్న.. ఐదుగురు కలిసి గ్రామంలో బైక్‌పై వెళ్తున్న సారయ్య, ఆయన కుమారుడు శ్రీరామ్‌పై కారం చల్లి సుత్తి, గొడ్డలితో దాడి చేశారు. శ్రీరామ్ పారిపోగా సారయ్యను విచక్షణారహితంగా నరికి చంపి పారిపోయారు. ఈ ఘటనపై శ్రీరామ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీఐ నాగార్జునరావు, ఎస్సై మ్యాక అభినవ్.. నిందితులను బొప్పారం క్రాస్ వద్ద అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు. దీంతో వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. కాగా, నిందితులను పట్టుకున్న సీఐ, ఎస్సైతో పాటు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

వారి భవితవ్యం తేలనుందా!

- అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకంపై ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు ఉత్తర్వులు
- కమిటీ వేసి రిపోర్టు పంపాలని ఉన్నత విద్యాశాఖ ఆదేశాలు
- ఇక కమిటీ నిర్ణయం కీలకం కానుందా?



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో వివిధ విభాగాల్లో 2010లో నియమితులైన అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాల్సింది. ఈ ఏడాది ఆగస్టులో హైకోర్టు డివిజన్ బెంచ్ కూడా ప్రభుత్వానికి సూచించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ఇటీవల ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలపై కమిటీ వేసి రిపోర్టు పంపాలని ఉత్తర్వులు పంపినట్లు సమాచారం. ఆ ఉత్తర్వులు కాకతీయ యూనివర్సిటీ అధికారులకు అందినట్లు తెలిసింది. దీంతో ఇక ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్ల భవితవ్యం తేలనుందని భావిస్తున్నారు. కమిటీ తీసుకొనే నిర్ణయంతో కూడిన రిపోర్టు కీలకం కాబోతుంది.

తుది నిర్ణయం ప్రభుత్వానిదే..

కేయూలో వివిధ విభాగాల్లో 2010లో 38మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించారు. అప్పట్లోనే ఉద్యోగాలు రాని పలువురు అభ్యర్థులు కోర్టులను ఆశ్రయించారు. ప్రధానంగా ఉద్యోగం రాని అభ్యర్థిని డాక్టర్ వినీత హైకోర్టును ఆశ్రయించారు. పూర్తిస్థాయి పాలకమండలి ఆమోదం లేకుండానే వీరిని నియమించారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. చివరకు కోర్టు ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలు కేయూ పూర్తిస్థాయి పాలకమండలిలో ఆమోదించుకోవాలని సూచించింది. దీంతో 2019 నవంబర్‌లో కేయూ పూర్తిస్థాయి పాలకమండలి సమావేశంలో వీరి నియామకాలపై చర్చించారు. ఇందులో అవతవకలు జరిగాయని భావించి పాలకమండలి సమావేశం వీరి నియామకాలు ఆమోదించలేదు.

ప్రభుత్వానికి ఫైల్..

అప్పటి అధికారులు వీరి నియామకాలపై నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వానికి ఫైల్‌ను పంపారు. వీరు నియామకమై సుమారు 14 సంవత్సరాలవుతున్నా ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదు. ఆ తరువాత కోర్టు ఆదేశాలతో యూనివర్సిటీ అధికారులు కేయూ జువాలజీ విభాగంలో ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లను ఉద్యోగం నుంచి తొలగించారు. ముగ్గురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉద్యోగ విరమణ పొందారు.మరో ఇద్దరు మృతి చెందారు. ఇంకొకరు 2010లోనే అప్పట్లోనే రాజీనామాచేశారు. మిగతా వారు అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా కొనసాగుతున్నారు.

వీరి నియామకాలపై ఇప్పటికీ పోరాటం

వీరి నియామకాలపై వినీత ఇప్పటికీ న్యాయ పోరాటం కొనసాగిస్తూనే ఉంది. దీంతో యూనివర్సిటీ అధికారులు ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్లకు పదోన్నతులు కల్పించడం లేదు. గ్రేడ్‌పే కూడా కల్పించడంలేదు. వీరిపై నిర్ణయం తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2022 డిసెంబర్‌లో కమిటీని నియమించింది. అయితే ఆ కమిటీని రద్దుచేయాలని జువాలజీ విభాగం పార్ట్‌టైం అధ్యాపకురాలు వినితనాయిని,గణిత విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ అంజన్‌రావు కలిసి హైకోర్టులో కేసు వేశారు. ఆతరువాత పరిణామాల నేపథ్యంలో ఆ కమిటీ రద్దు అయింది. ఇద్దరి అసిస్టెంట్ ప్రొఫెసర్లను మాత్రమే తొలగించారని మిగతా వారిని యథావిధిగా కొనసాగిస్తున్నారని వినిత కోర్టుధిక్కరణ కేసు వేశారు. దీంతో ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్లు కూడా హైకోర్టును ఆశ్రయించారు. చివరికి హైకోర్టు వీరి నియామకాలపై ఆరునెలల్లోగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని ఆదేశిస్తూ ఈఏడాది ఆగస్టులో ఉత్తర్వులు జారీ చేసింది. సుమారు నాలుగునెలలు గడిచాయి. వీరి భవితవ్యం ఇక ప్రభుత్వం చేతిలోనే ఉండడంతో ఎట్టకేలకు ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ఇటీవల రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు లేఖ తోకూడి ఉత్తర్వులు జారీచేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలపై కమిటీవేసి రిపోర్టును పంపాలని సూచిస్తూ ఉత్తర్వులు పంపినట్లు సమాచారం.

అక్రమ పేలుడు పదార్థాల పట్టివేత

- 74 జిలెటిన్ స్టిక్స్, 100 డిటోనేటర్స్, 53 ఫ్యూజ్‌లు స్వాధీనం


అక్రమ పేలుడు పదార్థాలను చూపుతున్న టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాజు

ఖిలా వరంగల్: ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన పేలుడు పదార్థాలను పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. కరీమాబాద్ బీరన్న కుంటలో శివ రాత్రి అనిత ఇంట్లో అక్రమంగా పేలుడు పదార్థాలు నిల్వ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీకి సమాచారం అందింది. ఏసీపీ ఆదేశాల ప్రకారం సోమవారం అనిత ఇంటిపై టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు, మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ జూపల్లి వెంకటరత్నం సంయుక్త ఆధ్వర్యంలో దాడి చేశారు. ఈ దాడిలో 74 జిలెటిన్ స్టిక్స్, 100 డిటోనేటర్స్, 53 ఫ్యూజ్‌లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అనితపై కేసు నమోదు చేసి తదుపరి చర్యలు నిమిత్తం కేసును మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ వెంకట రత్నంకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. కాగా, వడ్డెర వృత్తి బండ పేలుళ్ల కోసమైనా అనుమతులు అవసరమని, పేలుడు పదార్థాలు నిల్వ చేయడం నేరమన్నారు. ఈకార్యక్రమంలో ఆర్ఎస్సై ఓరుగంటి భానుప్రకాశ్, సిబ్బంది పాల్గొన్నారు.

అర్ధ శతాబ్దపు ‘అపూర్వ’ కలయిక


పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న కేఎంసీ 1974 బ్యాచ్ వైద్య విద్యార్థులు

- కేఎంసీలో 1974 బ్యాచ్ పూర్వ వైద్యవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఎంజీఎం : వరంగల్ నగరంలోని కాకతీయ మెడికల్ కాలేజీలో 1974 బ్యాచ్ వైద్య విద్యను అభ్యసించిన విద్యార్థులు 50 ఏళ్ల తరువాత సోమవారం కలుసుకున్నారు. కళాశాల ఆవరణలోని ఎన్ఆర్ఐ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో 44 మంది కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. వీరిలో చాలామంది వివిధ దేశాలు, రాష్ట్రాల్లో స్థిరపడ్డారు. 50 ఏళ్ల తరువాత కలుసుకోవడంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుంటూ నాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. కాలేజీలో అప్పుడు చదువుకున్న క్లాస్ రూములను సందర్శించారు. క్యాంపస్‌లో తాము తరచూ సందర్శించిన స్థలాల్లో మరోసారి కూర్చొని అప్పటి అనుభూతులను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న, ఉన్నతికి వేదిక అయినా కేఎంసీ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కాలేజీ క్యాంపస్ లో ఏదైనా శాశ్వత నిర్మాణాన్ని చేపట్టాలని నిర్ణయం చేశారు. సమ్మేళనంలో అప్పటి గురువుల ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు డాక్టర్ పోలానటరాజ్, డాక్టర్ కే.తిరుపతిరెడ్డి, డాక్టర్ ఏ.రవీంద్ర, డాక్టర్ కె.ప్రదీప్ రెడ్డి, కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సాంకేతిక బోర్డు సభ్యురాలిగా ఎంపీ కావ్య



హన్మకొండ చౌరస్తా: జాతీయ సహాయ పునరుత్పత్తి, సాంకేతిక బోర్డు సభ్యురాలిగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇద్దరు లోక్‌సభ సభ్యులు ఉండే ఈబోర్డులో ముగ్గురు నామినేషన్ వేయగా.. వారిలో ఒకరు ఉపసంహరించుకున్నారు. కావ్యతో పాటు మరో ఎంపీ ఆ బోర్డు సభ్యులుగా ఎన్నికయ్యారు. డాక్టర్ కావ్య ఇప్పటికే ఆరోగ్య మంత్రిత్వ శాఖ అనుబంధ ఆరోగ్య కుటుంబ సంక్షేమ సబ్ కమిటీ, స్కిల్ డెవలప్‌మెంట్ సబ్ కమిటీల్లో సభ్యురాలిగా కొనసాగుతున్నారు.

వేధింపులు తాళలేక గృహిణి ఆత్మహత్య


స్రవంతి (ఫైల్)

టేకుమట్ల: ఓ వ్యక్తి వేధింపులు తాళలేక గృహిణి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం ఆశిరెడ్డిపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఉడుత కుమారస్వామి కూతురు స్రవంతి(22)కి కొత్తపల్లిగోరి మండల కేంద్రానికి చెందిన బైకాని సాయితో 2019లో వివాహం జరిగింది. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ క్రమంలో టేకుమట్ల మండల కేంద్రానికి చెందిన మచ్చ రాకేశ్ ఈ నెల 5న కొత్తపల్లిగోరిలోని స్రవంతి ఇంటికి వచ్చి తనతో రావాలని బలవంతం చేయడంతో స్రవంతి మామ మల్లయ్య అడ్డుకోగా అతడిపై దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ గొడవల కారణంగా భర్త సాయి.. స్రవంతిని ఈ నెల 6న తల్లిగారింటి వద్ద వదిలి వెళ్లాడు. దీంతో మనస్తాపానికి గురైన స్రవంతి.. పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా గమనించిన కుటుంబీకులు చిట్యాల సివిల్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కాగా, గతంలో స్రవంతిని లైంగిక వేధింపులకు గురిచేసిన ఘటనలో రేగొండ పోలీస్‌స్టేషన్‌లో రాకేశ్‌పై కేసు నమోదైంది. సోమవారం మృతురాలి తండ్రి కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోగికారి ప్రసాద్ తెలిపారు.

భార్య కాపురానికి రావడం లేదని యువకుడు..


సంతోశ్ (ఫైల్)

నెక్కొండ: భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సోమవారం మండలంలోని అప్పల్‌రావుపేటలో జరిగింది. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మందపురి సంతోశ్(30)కు మూడేళ్ల క్రితం వరంగల్ కరీమాబాద్‌కు చెందిన సుజాతతో వివాహం జరిగింది. వీరి కాపురం ఆరు నెలల పాటు సవ్యంగానే సాగింది. ఈ క్రమంలో సంతోశ్ మద్యానికి బానిసకావడంతో సుజాత పుట్టింటికి వెళ్లింది. దీంతో సంతోశ్ హైదరాబాద్‌లో ఓ వైన్ షాపులో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో వారం క్రితం స్వగ్రామానికి వచ్చాడు. భార్య కాపురానికి రావడంలేదని మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి తల్లి జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్ పేర్కొన్నారు.

ఆన్‌లైన్ గేమ్‌లో డబ్బులు వస్తాయని ఆశతో..

- ఓ వ్యక్తికి రూ. 5లక్షలు పంపిన యువకుడు
- తిరిగి ఇవ్వకపోవడంతో బలవన్మరణం


అనుక్ (ఫైల్)

వర్ధన్నపేట: ఆన్‌లైన్ గేమ్‌లో డబ్బులు పెడితే వస్తాయని ఆశతో ఆన్‌లైన్‌లో పరిచయమైన వ్యక్తికి ఓ యువకుడు పలుమార్లు రూ. 5 లక్షలు పంపాడు. అయితే డబ్బులు అసలే రాకపోవడం.. పైగా తాను ఇచ్చిన వ్యక్తిని అడగగా ఆత్మహత్య చేసుకుంటానని బెదిరింపులకు పాల్పడడంతో భయభ్రాంతులకు గురైన సదరు యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని బండౌతాపురంలో జరిగింది. స్థానికులు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మరిపట్ల అనుక్(26) ఓ పెట్రోల్ పంపులో పనిచేస్తున్నాడు. ఆన్‌లైన్ గేమ్ ఆడుతుండగా ఓ వ్యక్తితో పరిచయమైంది. తాను చెప్పినట్లు ఆన్‌లైన్ గేమ్‌లో డబ్బులు పెడితే డబుల్ వస్తాయని నమ్మించాడు. దీంతో అనుక్ పలుమార్లు సుమారు రూ.5 లక్షల వరకు ఆ వ్యక్తికి పంపించాడు. అయితే డబ్బులు రాకపోవడంతో సదరు వ్యక్తిని అడుగగా కేవలం రూ.2లక్షలు ఇస్తానని చెప్పాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు సోమయ్య, యాకమ్మ కుమారుడి ధైర్యం చెప్పారు. అనంతరం అనుక్ మరోసారి సదరు వ్యక్తిని డబ్బులు అడగగా నువ్వు తరచూ డబ్బుల కోసం ఫోన్ చేస్తే ఆత్మహత్యకు పాల్పడుతానని, దీనికి నీవే కారణమని సూసైడ్ నోట్ రాస్తానని బెదిరించాడు. దీంతో భయభ్రాంతులకు గురైన అనుక్ సోమవారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు వరంగల్ ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు సాయంత్రం మృతిచెందాడు.

మల్లన్నను దర్శించుకున్న ఇస్రో స్పేస్ ట్యూటర్ శశాంక్


శశాంక్ భూపతిని సన్మానిస్తున్న ఈఓ నాగేశ్వర్‌రావు, అడ్డగూడి సతీశ్

ఐనవోలు: ఐనవోలు మల్లికార్జునస్వామిని హనుమకొండకు చెందిన ఇస్రో స్పేస్ ట్యూటర్ శశాంక్ భూపతి దర్శించుకున్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం అంతరిక్షంపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు స్పేస్ ట్యూటర్‌లను నియమించుకునే బాధ్యతను ఇస్రోకు అప్పగించింది. దీంతో ఇస్రో గత ఈ నెల 29న తెలంగాణ నుంచి శశాంక్‌ను నియమించింది. కాగా, సోమవారం శశాంక్ తన తల్లిదండ్రులు శంకర్, శ్యామలతో కలిసి మల్లన్నను దర్శించుకున్నారు. ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, ఆర్యవైశ్య సంఘం యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు అడ్డగూడి సతీశ్‌కుమార్ శశాంక్‌ను ఘనంగా సన్మానించారు.